ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5 తమిళనాడు
TAMILNADU
శుక్రవారం 27 సెప్టెంబరు 2024





జైలు నుంచి వెలుపలికి వస్తున్న సెంథిల్ బాలాజీ



కారు నుంచి అభివాదం చేస్తున్న బాలాజీ



జైలు ముందు గుమిగూడిన కార్యకర్తలు

ఎట్టకేలకు సెంథిల్ బాలాజీకి బెయిల్

- సుప్రీంకోర్టు ఉత్తర్వులు
- 471 రోజుల తర్వాత జనంలోకి



జైలు ముందు బాణసంచా కాలుస్తున్న అభిమానులు

చెన్నై, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ మంత్రి, డీఎంకే నేత సెంథిల్ బాలాజీకి ఎట్టకేలకు బెయిల్ లభించింది. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో రవాణా శాఖమంత్రిగా పనిచేసినప్పుడు డ్రైవర్, కండెక్టర్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ కొంతమంది వద్ద లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసగించారని, అక్రమ నగదు బట్వాడాకు పాల్పడ్డారనే నేరారోపణలపై అరెస్టయిన ఆయనకు ఎట్టకేలకు సుప్రీంకోర్టు గురువారం ఊరట నిచ్చింది. దీంతో 471 రోజుల జైలువాసం నుండి ఆయన బయటపడ్డారు. మొదట ఈ కేసును సెంట్రల్ క్రైం విభాగం విచారించింది.. ఈ వ్యవహారంలో భారీగా అక్రమ నగదు బట్వాడా జరిగిందంటూ ఈడీ అధికారులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో అరెస్టు కాగానే ముఖ్యమంత్రి స్టాలిన్ ఆయన్ని శాఖలు లేని మంత్రిగా ప్రకటించడం, ఆ నిర్ణయాన్ని గవర్నర్ వ్యతిరేకించడం, ఆ వివాదంలో హైకోర్టు గవర్నర్‌కు చురక అంటించి మంత్రి పదవుల కేటాయింపు ముఖ్యమంత్రి పరిధిలోని అంశమంటూ ఉత్తర్వులు జారీ చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైకోర్టు సూచన మేరకు ముఖ్యమంత్రి స్టాలిన్ సెంథిల్ బాలాజీని శాఖలు లేని మంత్రి పదవి నుండి తొలగించారు. ఈ నేపథ్యంలో 15 నెలలపాటు పుళల్ సెంట్రల్ జైలులో ఉన్న సెంథిల్ బాలాజీ బెయిలు కోసం తీవ్రంగా ప్రయత్నించారు. నగరంలోని ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ కోర్టు, హైకోర్టులో వేసిన బెయిలు పిటిషన్లు వరుసగా తోసివేయబడ్డాయి. ఐదు సార్లు బెయిలు పిటిషన్లను హైకోర్టు తోసిపుచ్చటంతో సెంథిల్‌బాలాజీ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తొలుత ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీం కోర్టు బెయిలు నిరాకరించింది. ఈ నేపథ్యంలో మళ్లీ ఆయన బెయిలు కోసం సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకున్నారు. ఈ పిటిషన్‌పై సుప్రీం కోర్టు న్యాయమూర్తులు అబస్ ఎస్ ఓహా, అగస్టిన్ జార్జ్ మాయిస్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఇరుపక్షాల వాద ప్రతివాదనలు ముగియడంతో తీర్పు వాయిదా వేసింది. ఆ ప్రకారం గురువారం ఉదయం సెంథిల్ బాలాజీకి బెయిలు మంజూరు చేసింది. సుదీర్ఘకాలం విచారణ ఖైదీగా కొనసాగుతున్నారనే అంశాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ బెయిలు మంజూరు చేసినట్లు స్పష్టం చేసింది. చెన్నైలో ఈడీ కార్యాలయంలో వారానికి రెండు రోజులు సంతకం చేయాలని, రూ.25లక్షలతో ఇద్దరు పూచీకత్తు సమర్పించాలని, సాక్షులను తారుమారు చేయకూడదనే నిబంధనలతో ఈ బెయిలు మంజూరైంది.

పుళల్ జైలు వద్ద కార్యకర్తల సందడి...

సుప్రీం కోర్టు బెయిలు ఉత్తర్వు ప్రకారం సెంథిల్ బాలాజీ విడుదలవుతారన్న సమాచారంతో గురువారం ఉదయం నుండే పుళల్ సెంట్రల్ జైలు వద్ద డీఎంకే కార్యకర్తలు, పార్టీ ప్రముఖులు, అనుచరులు పెద్ద సంఖ్యలో గుమికూడారు. సుప్రీం కోర్టు ఉత్తర్వు నగరంలోని ప్రిన్సిపల్ కోర్టు మేజిస్ట్రేట్ కార్తికేయన్‌కు అందింది. అందులో వివరాలను ఆయన పరిశీలించి, సెంథిల్‌బాలాజీ విడుదలకు ఎలాంటి అభ్యంతరాలు లేవని ఆయన ప్రకటించారు. దీంతో గురువారం రాత్రి 7.15 గంటల ప్రాంతంలో సెంథిల్ బాలాజీ విడుదలయ్యారు.

త్యాగశీలిగా చిత్రీకరిస్తారా?: తమిళిసై ఆగ్రహం

అవినీతి కేసులో అరెస్టయి బెయిలుపై విడుదల కానున్న మాజీ మంత్రి సెంథిల్‌బాలాజీని త్యాగశీలిగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తారా అంటూ బీజేపీ మహిళా నేత డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ ముఖ్యమంత్రి స్టాలిన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలుత ఈ అవినీతి కేసు వేసింది డీఎంకే ప్రభుత్వమేనని, ఆ కేసు పొడిగింపు దర్యాప్తు ఈడీ చేపట్టిందని తెలిపారు. సెంథిల్‌బాలాజీ నిర్దోషిగా విడుదల కాలేదని, బెయిలుపై విడుదలవుతున్నారని స్పష్టం చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే స్టాలిన్ సోదరా నీ త్యాగం పెద్దది అంటూ స్టాలిన్ పొగడటం గర్హనీయమన్నారు.

జైలుకు పంపింది మీరే...

సెంథిల్‌బాలాజీపై అవినీతి కేసు పెట్టి ఆయన్ని జైలుకు పంపిన డీఎంకే నాయకులే ప్రస్తుతం స్వాగతం పలుకుతున్నారని నామ్‌తమిళర్ కట్చి నేత శీమాన్ విమర్శించారు. సెంథిల్‌బాలాజీని ముఖ్యమంత్రి స్టాలిన్ సహా పలువురు నాయకులు త్యాగధనుడిగా చిత్రీకరించేందుకు ప్రయత్నించడం రాజకీయ స్వలాభం కోసమేనని అన్నారు.

సెంథిల్‌బాలాజీ సాక్షులను తారుమారు చేసే అవకాశం ఉందని బీజేపీ ఎమ్మెల్యే వానతి శీనివాసన్ తెలిపారు.

రాజకీయ కక్షతోనే కేసు: సెంథిల్ బాలాజీ

రాజకీయకక్షతోనే తనను కేసులో ఇరికించారని సెంథిల్ బాలాజీ పేర్కొన్నారు. జైలు నుంచి విడుదలైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈరాజకీయకక్షల్ని న్యాయపరంగా ఎదుర్కొంటానని ప్రకటించారు. తనకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

58 సార్లు కస్టడీ పొడిగింపు..

గత యేడాది జూన్ 14న అరెస్టయిన మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ కస్టడీ 58 సార్లు పొడిగించారు. విచారణ ఖైదీగా ఉన్న వ్యక్తి జ్యుడీషియల్ కస్టడీ ప్రతి 15 రోజులకొక మారు పొడిగించడం ఆనవాయితీ. ఆ ప్రకారం 15 నెలల తీవ్ర ప్రయత్నాల వల్లే ఆయన బెయిలుపై విడుదలవుతున్నారు. సుప్రీం కోర్టులో బెయిలు రావటానికి సుమారు ఏడుమాసాలు పట్టింది.

కరూరులో సందడి

సెంథిల్ బాలాజీకి సుప్రీం కోర్టు బెయిలు మంజూరైనట్లు వార్త వెలువడగానే ఆయన స్వస్థలం కరూరులో పార్టీ శ్రేణులు టపాకాయలు పేల్చి, మిఠాయిలు పంచి పండుగ చేసుకున్నారు.

మళ్లీ మంత్రి పదవికి అడ్డంకి లేదు...

సెంథిల్‌బాలాజీ మళ్లీ మంత్రి పదవి చేపట్టేందుకు న్యాయపైన అడ్డంకులేవీ లేవని ఆయన తరఫు న్యాయవాది, డీఎంకే ఎంపీ ఎన్ఆర్ ఇలంగో తెలిపారు. సెంథిల్‌బాలాజీ 15 నెలలు విచారణ ఖైదీగా ఉన్నారనే కారణంగా, వ్యక్తిగత హక్కుల పరిరక్షణ దిశగానే సుప్రీం కోర్టు ఆయనకు బెయిలు మంజూరు చేసిందన్నారు. సెంథిల్‌బాలాజీ మళ్లీ మంత్రిపదవిని చేపట్టేందుకు సుప్రీం కోర్టు ఎలాంటి అభ్యంతరాలు తెలుపలేదని ఆయన గుర్తు చేశారు.

సోదరా నీ త్యాగం అమోఘం: స్టాలిన్

సుప్రీంకోర్టు బెయిలుపై సెంథిల్‌బాలాజీని విడుదల చేస్తూ తీర్పు వెలువరించగానే ముఖ్యమంత్రి స్టాలిన్ ఎక్స్‌పేజీలో ఓ సందేశం వెలువరించారు. '471 రోజుల తర్వాత సోదరుడు సెంథిల్‌బాలాజీకి సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రాజకీయ ప్రత్యర్థులపై కక్షతీర్చుకోవడమే ఆనవాయితీగా పెట్టుకుంది. ఎమర్జెన్సీలో కూడా ఇన్ని రోజుల పాటు ఎవరూ జైలు వాసం గడుపలేదు. ఆయనపై రాజకీయ కుట్రలు 15 నెలలపాటు కొనసాగాయి. ఈడీ అరెస్టు చేసి నెలలతరబడి జైలులో ఉంచినా సెంథిల్‌బాలాజీ ఏ మాత్రం తొణకలేదు, బెదరలేదు. ఆత్మస్థైర్యంగా ఉన్నారు. జైలు వాసం నుండి బయటపడుతున్న సోదరుడు సెంథిల్‌బాలాజీకి స్వాగతం. నీ త్యాగం అమోఘం' అంటూ ఆ సందేశంలో పేర్కొన్నారు. ఇదే విధంగా టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, సీపీఐ నేత ముత్తరసన్ సహా డీఎంకే మిత్రపక్షాల నాయకులు సెంథిల్ బాలాజీ బెయిలుపై విడుదల కావటం పట్ల హర్షం ప్రకటించారు.

ముంచెత్తిన వాన

35 విమాన సర్వీసుల రద్దు ● నరకం చూపిస్తున్న ట్రాఫిక్ సమస్య



అడయార్, సెప్టెంబరు 26: చెన్నై మహానగరాన్ని భారీ వర్షం ఒక్కసారిగా ముంచెత్తింది. బుధవారం రాత్రి కొన్ని గంటల పాటు కుంభవృష్టి కురిసింది. దీంతో విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. కొన్ని విమాన సర్వీసులను ఏకంగా రద్దు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. మరికొన్ని విమానాలు ల్యాండ్ కాలేకపోవడంతో బెంగళూరుకు డైవర్షన్ చేశారు. బుధవారం సాయంత్రం నుంచే నగరంలో ఆకాశం దట్టంగా మేఘావృతమై కనిపించింది. రాత్రి పొద్దుపోయాక నగరంతో పాటు శివారు ప్రాంతాలను భారీ వర్షం ముంచెత్తింది. ప్రధాన రహదారులపైకి వర్షపునీరు చేరడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైంది. అలాగే, విమాన సర్వీసులకు కూడా అంతరాయం ఏర్పడింది. బెంగుళూరు, ముంబై, విజయవాడ, భువనేశ్వర్, కోళికోడ్, తిరుచ్చి, తిరువనంతపురం, కౌలాలంపూర్ తదితర ప్రాంతాల నుంచి చెన్నై వచ్చిన 13 విమానాలు ప్రతికూల వాతావరణం కారణంగా ల్యాండింగ్ కాలేక గగనతలంలోనే చక్కర్లు కొట్టాయి. వర్షం తగ్గడంతో విమానాలు ల్యాండ్ అయ్యాయి. అయితే, తిరుచ్చి నుంచి 68 మంది ప్రయాణికులతో రాత్రి 10.05 గంటలకు చెన్నై వచ్చిన విమానంలో ఇంధనం తక్కువగా ఉండటంతో ఈ విమానాన్ని వెంటనే బెంగళూరుకు దారి మళ్ళించారు. అదేవిధంగా చెన్నై నుంచి ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, కొచ్చి, కోవై, కోల్‌కతా, ఇండోర్, సింగపూర్, అబుదాబి, కౌలాలంపూర్‌తో సహా 20 ప్రాంతాలకు వెళ్ళాల్సిన విమాన సర్వీసులు ప్రతికూల వాతావరణం కారణంగా రెండు గంటల ఆలస్యంగా బయలుదేరి వెళ్ళాయి. అలాగే, శ్రీలంక రాజధాని కొలంబో నుంచి చెన్నై రావాల్సిన విమానం, చెన్నై నుంచి కొలంబో వెళ్ళాల్సిన విమాన సర్వీసులను పూర్తిగా రద్దు చేశారు. అలాగే, వివిధ ప్రాంతాల నుంచి చెన్నై రావాల్సిన, చెన్నై నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్ళాల్సిన 35 విమాన సర్వీసులను రద్దు చేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యంతో పాటు ఇబ్బందులకు గురయ్యారు. కాగా గురువారం ఉదయం 6 గంటల ప్రాంతంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.


ఎటు చూసినా ట్రాఫిక్ సమస్యే...



చెన్నై మహానగరం ట్రాఫిక్ సమస్యతో తల్లడిల్లిపోతుంది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకవైపు మెట్రో రైల్ నిర్మాణ పనులతో పాటు మరోవైపు వర్షాల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుండటంతో వాహనచోదకులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నారు. కొన్ని సందర్భాల్లో అంబులెన్స్ సర్వీసులు కూడా ట్రాఫిక్‌లో ఇరుకుంటున్నాయి. చెన్నై నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో మెట్రోరైల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వీటికి తోడు వర్షపునీటి కాల్వలు, డ్రైనేజీ కాల్వల నిర్మాణం కోసం రోడ్లను తవ్వేశారు. పలు ప్రాంతాల్లో నిర్మాణ పనులకు ఆటంకం కలుగకుండా బారికేడ్లు పెట్టారు. ఇంకొన్ని ప్రాంతాల్లో వన్‌వే గా మార్చారు. ట్రాఫిక్ మార్పుల పేరుతో కొన్ని వాహనాలను జనావాస ప్రాంతాల్లో వీధుల మీదుగా మళ్ళించారు. దీనికి తోడు వర్షాల కారణంగా రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండటంతో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది.

పేలుతున్న తూటా

రౌడీల గుండెల్లో గుబులు ● 26 ఏళ్లలో 125 ఎన్‌కౌంటర్లు



చెన్నై, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'ఎన్‌కౌంటర్'.. ప్రస్తుతం రాష్ట్రంలో రౌడీల గుండెల్లో గుబులు రేపుతున్న పదమిది.. కరడుగట్టిన రౌడీల గుండెలను చీల్చుతున్న తూటా శబ్దమది.. తప్పొప్పులు, నిజానిజాల సంగతెలాగున్నా ఇటీవలి కాలంలో రాష్ట్రంలో నిత్యం వినిపిస్తున్న ఈ పదం తీవ్ర దుమారం రేపుతోంది. హఠాత్తుగా రౌడీలు ఇప్పుడే పోలీసులపై ఎందుకు తిరగబడుతున్నారని కొందరు అడుగుతుండగా.. ఖాకీలు మాత్రం ఎందుకు హఠాత్తుగా ఎన్‌కౌంటర్లు జరుపుతున్నారని మరికొందరు నిలదీస్తున్నారు. ఈవాదోపవాదాల సంగతెలాగున్నా..ఖాకీల తూటాలకు బలవుతున్న రౌడీల సంఖ్యమాత్రం ఇటీవలి కాలంలో గణనీయంగా పెరగడం చర్చనీయాంశమైంది.

1970 నుంచే...

రాష్ట్రంలో 1970 - 80 మధ్య కాలంలో ఎన్‌కౌంటర్ ఘటనలు ప్రారంభమయ్యాయని చెప్పవచ్చు. అది కూడా నక్సలైట్లకు వ్యతిరేకంగా జరిగిన ఘటన. 1979, సెప్టెంబరు 17తేదీ హొగనేకల్‌లో అప్పు, 1980 సెప్టెంబరు 17న బాలన్ అనే వ్యక్తి ఎన్‌కౌంటర్‌కు బలయ్యారు. అనంతరం పోలీసుల తుపాకీ దృష్టి రౌడీల వైపు మళ్లింది. 1984లో తిరునల్వేలిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో శివలప్పేరి పాండి హతమయ్యాడు. రాష్ట్రంలో నేరచరితులు ఎన్‌కౌంటర్‌కు బలైన తొలి ఘటన ఇదే. అనంతరం పలు సందర్భాల్లో రౌడీషీటర్లుగా చెలామణి అవుతున్న వారిపై పోలీసుల తుపాకీ తూటా పేలింది.

సంచలనం రేపిన ఎన్‌కౌంటర్లు...

ఈ నేపథ్యంలో 1996 జూలై 10న నుంగంబాక్కం లయోలా కళాశాల సమీపంలో ప్రముఖ రౌడీ ఆశై తంబి, అతని అనుచరులు గుణ, మనో ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో పట్టపగలు ఈ ఎన్‌కౌంటర్ జరగడం అప్పట్లో సంచలనం రేపింది. అదే ఏడాది అడయార్‌లో కపిలన్ అనే రౌడీ కూడా ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. అనంతరం 2003లో అయోధ్యకుప్పంలో వీరమణిని పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. రాష్ట్రంలోనే కాక దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఘటన వీరప్పన్ ఎన్‌కౌంటర్. తమిళనాడు-కర్ణాటక రాష్ట్రాల పోలీసులకు ముప్పుతిప్పలు పెట్టిన ఎర్రచందనం స్మగ్లర్ వీరప్పన్, అతని అనుచరులు సేతుకుళి గోవిందన్, చంద్రగౌడ, సేతుమణిని 2004 అక్టోబరు 18న కె.విజయకుమార్ నేతృత్వంలోని తమిళనాడు టాస్క్‌ఫోర్స్ ధర్మపురి జిల్లా పాప్పారపట్టి సమీపంలో ఎన్‌కౌంటర్ చేసింది. దేశవ్యాప్తంగా సంచలనం రేపిన మరో ఘటన కోయంబత్తూర్‌లో 2010 నవంబర్ 10న చోటుచేసుకుంది. పాఠశాలకు వెళుతున్న బాలికను, ఆమె తమ్ముడిని వ్యాన్‌లో కిడ్నాప్ చేసి అత్యాచారం చేసి దారుణంగా హతమార్చిన ఘటనలో డ్రైవర్ మోహన్ పోలీసుల నుంచి తప్పించుకొనే ప్రయత్నంలో పోలీసుల ఎన్‌కౌంటర్‌కు నేలవాలాడు.

ఇటీవల జరిగిన ఘటనలు...

నగరంలో బీఎస్పీ అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ ఆయన ఇంటి సమీపంలో దారుణ హత్యకు గురైన ఘటనలో పొన్నై బాలు, ప్రముఖ రౌడీ తిరువేంగడం సహా పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అరుణ్ రౌడీలపై ఉక్కుపాదం మోపారు. రౌడీలకు వారి పంథాలోనే సమాధానం చెబుతామని బాధ్యతలు చేపట్టిన రోజే కమిషనర్ హెచ్చరించారు. అనంతరం నగరవ్యాప్తంగా రౌడీల ఆగడాలు అడ్డుకొనేలా పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. అలాగే, ఏడీఎస్పీ డేవిడ్‌సన్ దేవాశీర్వాదం సూచనలతో రాష్ట్రవ్యాప్తంగా రౌడీలను కట్టడి చేసే చర్యలు ప్రారంభమయ్యాయి. అజ్ఞాతంలోకి వెళ్లిన రౌడీల ఆచూకీ గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నాలు చేపట్టారు. అలా తనిఖీలు చేపట్టిన సమయంలో, పుదుకోట అటవీ ప్రాంతంలో తల దాచుకున్న ప్రముఖ రౌడీ దురై, పోలీసులపై కాల్పులు జరిపి తప్పించుకోబోయాడు. ఆ సమయంలో పోలీసులు ఆత్మరక్షణ కోసం జరిపిన కాల్పుల్లో దురై మృతిచెందాడు. అదేవిధంగా కొద్ది రోజుల క్రితం రౌడీ కాకా బాలాజీ ఎన్‌కౌంటర్, మూడు రోజుల క్రితం మరో ఎన్‌కౌంటర్ జరిగింది. స్థానిక వేళచ్చేరిలో బార్ యజమానిని బెదిరించిన కేసులో గాలిస్తున్న రౌడీ రాజా అలియాస్ సీజింగ్ రాజా రాష్ట్ర పోలీసులు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. నగరంలో మూడు నెలల్లో మూడు ఎన్‌కౌంటర్లలో ముగ్గురు పేరుమోసిన రౌడీలు మృతిచెందారు. దీంతో నగరంతో పాటు రాష్ట్రంలో వున్న చాలామంది రౌడీలు పొరుగు రాష్ట్రాలకు పారిపోయి తల దాచుకుంటున్నారు.

26 ఏళ్లలో 125 మంది ఎన్‌కౌంటర్ ...

రాష్ట్రంలో 1998 నుంచి డీఎంకే ప్రభుత్వ హయాంలో 69 ఎన్‌కౌంటర్లు, అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో 56 ఎన్‌కౌంటర్లు జరిగాయి. 1998 నుంచి 2001 వరకు డీఎంకే ప్రభుత్వంలో 22 ఎన్‌కౌంటర్లు, 2001 నుంచి 2006 వరకు అన్నాడీఎంకే ప్రభుత్వంలో 29 ఎన్‌కౌంటర్లు, 2006 నుంచి 2011 వరకు డీఎంకే ప్రభుత్వంలో 31 ఎన్‌కౌంటర్లు, 2011 నుంచి 2021 వరకు అన్నాడీఎంకే ప్రభుత్వంలో 27 ఎన్‌కౌంటర్లు చోటుచేసుకున్నాయి. ప్రస్తుత డీఎంకే ప్రభుత్వం హయాంలో 2021 మే నుంచి ఇప్పటివరకు 16 ఎన్‌కౌంటర్లు జరిగాయి. నేరాలతో సంబంధాలున్న ఎన్‌కౌంటర్లు మినహా, అన్నాడీఎంకే ప్రభుత్వంలో 2011లో పరమకుడి తుపాకీ కాల్పుల్లో ఏడుగురు, 2018 తూత్తుకుడిలో జరిగిన తుపాకి కాల్పుల్లో 13 మంది మృత్యువాతపడ్డారు.

కాగా ఈ ఎన్‌కౌంటర్లతో రౌడీల పీడ విరగడవుతోందని కొందరు వ్యాఖ్యానిస్తుండగా, ఏ రూపంలోనైనా సరే ఎవరినైనా హతమార్చే హక్కు ఎవ్వరికీ లేదని మానవహక్కుల సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. పోలీసులు ఎప్పటిలానే తమ విధి నిర్వహణలో ప్రాణాలకు ముప్పు కలగడం వల్లనే ఆత్మరక్షణ కోసం ఎన్‌కౌంటర్ చేయాల్సి వస్తోందని చెబుతున్నారు. అయితే సదరు రౌడీల చేతుల్లో బలైన కుటుంబాలు రోడ్డున పడుతుండగా, పోలీసుల చేతుల్లో హతమైన రౌడీల కుటుంబాలు అనధికారిక సమాజ బహిష్కరణ ఎదుర్కొంటున్నాయి. తప్పెవరిది? ఫలితం అనుభవిస్తున్నదెవరు?.

జారి పడుతున్నారు బాస్!

ఈ మధ్య కాలంలో రాష్ట్రంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినవారు, యువతులను వేధించిన వారు, అఘాయిత్యాలకు పాల్పడిన వారు అరెస్టయిన మరునాడే పోలీస్ స్టేషన్లలో కాలు జారి పడినట్లు మీడియాలో ఫొటోలు కనిపిస్తున్నాయి. మరి వారు ఎందుకు పడుతున్నారో, ఎలా పడుతున్నారో బయటకు రావడం లేదు గానీ.. అరెస్టయిన మరునాడే ఆ నేరగాళ్ల కాళ్లు, చేతులు విరగ్గొట్టుకుని ఆస్పత్రుల పాలవుతున్నారు. రౌడీలూ గ్రహిస్తున్నారా?.. మీరూ 'జారి పడకుండా' ఉండాలంటే .. 'ఒళ్లు దగ్గరపెట్టుకుని' నడచుకోవాలి మరి!

బిషప్ ఎజ్రా సర్గుణంకు కన్నీటి వీడ్కోలు



బిషప్ ఎజ్రా సర్గుణం భౌతిక కాయానికి అంజలి ఘటిస్తున్న సీఎం స్టాలిన్ తదితరులు

ప్యారీస్, సెప్టెంబరు 26: వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా ఇటీవల మరణించిన ఈసీఐ బిషప్ ఎజ్రా సర్గుణం అంత్యక్రియలు గురువారం పోలీసు లాంఛనాలతో జరిగాయి. ఈ నెల 22న మృతిచెందిన ఎజ్రా సర్గుణం కుమార్తె అమెరికా నుంచి రావడంతో అంత్యక్రియలు ఆలస్యమయ్యాయి. వానగరంలో ఉన్న జీసస్ కాల్స్ ప్రాంగణంలో ప్రజల సందర్శనార్థం ఉంచిన ఎజ్రా సర్గుణం భౌతికకాయానికి ఈఎస్‌ఐ బిషప్‌లు, క్రైస్తవ సంఘాల నాయకులు అంజలి ఘటించారు. అలాగే, ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, పొన్ముడి, పీకే శేఖర్‌బాబు, సెంజిమ స్తాన్, మేయర్ ప్రియ తదితరులు అంజలి ఘటించారు. మైనార్టీ విభాగం మాజీ ఛైర్మెన్ పీటర్ అల్ఫోన్స్, అన్నాడీఎంకే మాజీ మంత్రి పి.బెంజిమెన్, ఎమ్మెల్యే ఇన్బదురై, టీవీకే పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత తదితరులు నివాళులర్పించారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు కీల్పాక్కంలో ఉన్న సమాధుల తోటలో పోలీసు లాంఛనాలతో ఎజ్రా సర్గుణం భౌతికకాయాన్ని ఖననం చేశారు.



అనారోగ్యంతో బుధవారం కన్నుమూసిన ఒంగోలు మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ పార్థివదేహానికి గురువారం నెల్లూరులో నివాళులర్పిస్తున్న తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, కెన్సెస్ గ్రూపు సంస్థల చైర్మన్ కె.నరసారెడ్డి, ఆస్కా మేనేజింగ్ ట్రస్టీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు. చిత్రంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

సమాచార దర్శిని

బాలికలకు పురస్కారాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 26: ఆడశిశువుల సంక్షేమం కోసం పాటుపడే వారికి ప్రభుత్వం పురస్కారాలు అందజేస్తోంది. అర్హులైన వారు అక్టోబరు 3వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. బాల్య వివాహాలు, బాలికలకు వ్యతిరేకమైన నేరాలను అడ్డుకోవడం వంటి వివిధ సాహస కార్యక్రమాలు చేపట్టే 18 ఏళ్లలోపున్న బాలికలకు జనవరి 24వ తేది ప్రభుత్వం పురస్కారంతో పాటు రూ. లక్ష నగదు బహుమతి అందజేయనుంది. ఔత్సాహికులు http://awards.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

21న తమిళనాడు ఓపెన్ వర్సిటీ స్నాతకోత్సవం

ఐసిఎఫ్, సెప్టెంబరు 26: తమిళనాడు సార్వత్రిక విశ్వవిద్యాలయ 15వ స్నాతకోత్సవం అక్టోబరు 21వ తేది జరుగనుంది. 2023 జులై, 2024 జనవరి సెమిస్టర్లలో యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సైదాపేటలోని వర్సిటీ ఆడిటోరియంలో సాయంత్రం 4.30 గంటలకు జరిగే కార్యక్రమంలో పట్టాలు అందజేయనున్నారు. సర్టిఫికెట్లకు రుసుము చెల్లించని వారు వర్సిటీ వెబ్‌సైట్ ద్వారా రూ.750 చెల్లించాలని అధికారులు సూచించారు. ఇతర వివరాలకు 044-24306665 నెంబరు సంప్రదించవచ్చు.

రూ.60 కోట్లతో ఆరు బస్టాండ్ల పునరుద్ధరణ

ఐసిఎఫ్, సెప్టెంబరు 26: నగరంలో రూ.60 కోట్లతో ఆరు బస్టాండ్లు పునరుద్ధరించనున్నట్లు అధికారులు తెలిపారు. టి.నగర్, అయ్యప్పన్‌తాంగల్, తిరువాన్మియూర్, ఆవడి, పాడియనల్లూర్, మింట్ వల్లలార్ నగర్ తదితర బస్టాండ్లను తలా రూ.10 కోట్ల వ్యయంతో పునరుద్ధరించనున్నట్లు సీఎండీఏ అధికారులు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లభించిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ పనుల్లో భాగంగా ప్రయాణికులు అంతరాయం కలుగకుండా ఉండేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు.

గోధుమల కేటాయింపు 17,100 టన్నులకు పెంపు

ఐసిఎఫ్, సెప్టెంబరు 26: రాష్ట్రానికి గోధుమల కేటాయింపు 17,100 టన్నులకు పెరిగింది. రేషన్ దుకాణాల్లో బియ్యం కార్డుదారులకు బియ్యానికి బదులు గోధుమలు ఉచితంగా అందజేస్తున్నారు. చెన్నై, జిల్లా ప్రధాన నగరాల్లో ఒక కార్డుకు ప్రతినెలా గరిష్ఠంగా 10 కిలోలు, ఇతర ప్రాంతాల్లో నివసించే వారికి 5 కిలోలు పంపిణీ చేస్తున్నారు. ఈ గోధుమలను భారత ఆహార సంస్థ కేటాయిస్తుంది. ప్రతినెలా 13,000 టన్నుల గోధుమలు అందజేస్తుండగా, ఇటీవల తక్కువగా దిగుమతవుతోంది. ఈ నేపథ్యంలో, ఆహార శాఖ మంత్రి చక్రపాణి కేంద్ర ఆహార శాఖకు అదనంగా గోధుమలు సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో, రాష్ట్రానికి గోధుమల కేటాయింపు 17,100 టన్నులకు పెంచుతూ కేంద్ర ఆహార శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ గోధుమలు అక్టోబరు 24వ తేది నుంచి పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

రేపు అంతర్జాతీయ కర్రసాము పోటీలు

పుదుచ్చేరి,సెప్టెంబరు26:పుదుచ్చేరిలో అంతర్జాతీయ పారంపర్య కర్రసాము ఛాంపియన్ షిప్ పోటీలు శనివారం జరుగనున్నాయి. కలితీర్థాల్‌కుప్పంలోని మనకుళ వినాయగర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో శని,ఆదివారాల్లో జరిగే ఈపోటీల్లో దేశంతో పాటు నేపాల్, భూటాన్ సహా పలుదేశాలకు చెందిన 6నుంచి 21 ఏళ్లలోపున్న 400 మంది క్రీడాకారులు పాల్గొంటారు.నాలుగు విభాగాల్లో జరుగనున్న పోటీలను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రంగస్వామి ప్రారంభించనున్నారు.

6న చెస్ పోటీలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 26: జీఎం చెస్ అకాడమీ, శాన్ అకాడమీ సంయుక్తంగా 2వ రాష్ట్రస్థాయి చెస్ పోటీలు అక్టోబరు 6న నిర్వహించనున్నాయి. వెస్ట్ తాంబరం శాన్ అకాడమీ ప్రాంగణంలో 8,10,13,25 ఏళ్ల విభాగాల్లో పోటీలు జరుగనున్నాయి. ఆసక్తి ఉన్న వారు అక్టోబరు 4వ తేది రాత్రి 10 గంటల్లోపు 9941514097, 8838229938 నెంబర్లు సంప్రదించి పేరు నమోదుచేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

హోంగార్డులకు ప్రత్యేక క్యాంటీన్

ఐసిఎఫ్, సెప్టెంబరు 26: హోంగార్డులకు ప్రత్యేక క్యాంటీన్ సౌకర్యం కల్పించారు. చెన్నై పోలీసు శాఖలో ఉన్న 2,256 మంది హోంగార్డులు 104 పోలీస్‌స్టేషన్లు, 56 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లలో పోలీసులతో కలిసి విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ప్రత్యేక క్యాంటీన్ ఏర్పాటుచేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆ ప్రకారం, చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయంలో హోంగార్డులకు ప్రత్యేక క్యాంటీన్ ఏర్పాటుచేశారు. ఇందులో హోంగార్డులు నెలకు రూ.15,000లకు కిరాణా వస్తువులు, ఏడాదికి రూ.1.50 లక్షలకు విద్యుత్ సాధనాలు కొనుగోలు చేయవచ్చని ప్రకటించారు.

అండమాన్, కొచ్చిన్‌లకు విమాన సేవలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 26: రాజధాని చెన్నై నగరం నుంచి అండమాన్, కొచ్చిన్ మధ్య స్పైస్ జెట్ సంస్థ అక్టోబరులో విమాన సేవలు ప్రారంభించనుంది. చెన్నై నుంచి మధ్యాహ్నం 1 గంటకు బయల్దేరే విమానం 3 గంటలకు అండమాన్ చేరుకుంటుంది. అండమాన్ నుంచి ఉదయం 10.10 గంటలకు బయల్దేరే విమానం మధ్యాహ్నం 12.20 గంటలకు చెన్నై చేరుతుంది. ఈ సేవలు అక్టోబరు 1వ తేది నుంచి ప్రారంభం కానున్నాయి. అలాగే, కేరళ రాష్ట్రం కొచ్చిన్‌కు చెన్నై నుంచి ఉదయం 6.25 గంటలకు బయల్దేరే విమానం 8.20 గంటలకు కొచ్చిన్ చేరుకుంటుంది. కొచ్చిన్ నుంచి సాయంత్రం 6.30 గంటలకు బయల్దేరే విమానం రాత్రి 8.05 గంటలకు చెన్నై చేరుతుంది. ఈ సేవలు అక్టోబరు 10వ తేది నుంచి ప్రారంభం కానున్నాయి.

గంజాయి స్మగ్లింగ్.. ఇద్దరి అరెస్టు

అడయార్, సెప్టెంబరు 26: ఒడిశా రాష్ట్రం నుంచి చెన్నైకి ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయి అక్రమంగా రవాణా చేసిన కేసులో ఇద్దరు వ్యక్తులను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి ఏడు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి చెన్నై వచ్చే రైళ్లలో భారీ ఎత్తున గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్టు సెంట్రల్ రైల్వే పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఉత్తరాది రాష్ట్రాల నుంచి రైళ్లలో వచ్చే ప్రయాణికులపై నిఘా ఉంచారు. ఇందుకోసం రైల్వే పోలీసులు మఫ్టీలో స్టేషన్‌లో సంచరిస్తూ, అనుమానాస్పదంగా కనిపించే వారి లగేజీ తనిఖీ చేస్తున్నారు. ఈ కోణంలోనే బుధవారం ఒడిశా నుంచి వచ్చిన ఎక్స్‌ప్రెస్ రైలు అన్‌రిజర్వ్‌డ్ బోగీలో తనిఖీలు చేసి అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారు పొంతనలేకుండా సమాధానాలు చెప్పడంతో వారి బ్యాగులను తనిఖీ చేయగా ఏడు కేజీల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీరిని ఒడిశాకు చెందిన కొందరం బా స్వేన్, సాహూ అనే వారిగా గుర్తించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

న్యాయవాదులకు మాస్టర్ హెల్త్ చెకప్

● హైకోర్టులో ప్రారంభించిన ఇన్‌చార్జి సీజే కృష్ణకుమార్

ప్యారీస్, సెప్టెంబరు 26: ప్రపంచ హృదయ దినం సందర్భంగా మద్రాసు హైకోర్టులో న్యాయవాదుల కోసం ఏర్పాటుచేసిన రెండు రోజుల మాస్టర్ హెల్త్ చెకప్ శిబిరాన్ని హైకోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి కృష్ణకుమార్ గురువారం ప్రారంభించారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని సెప్టెంబరు 29వ తేది జరుపుకోనున్న నేపథ్యంలో, మద్రాసు బార్ అసోసియేషన్, బిల్రూత్ ఆస్పత్రి యాజమాన్యం సంయుక్తంగా బార్ అసోసియేషన్ సభ్యుల కోసం మాస్టర్ హెల్త్ చెకప్ శిబిరం నిర్వహించనున్నారు. శుక్రవారం వరకు జరుగనున్న ఈ శిబిరంలో గుండె సమస్యలకు సంబంధించి బార్ అసోసియేషన్ సభ్యుల కుటుంబంలో ఇద్దరు లబ్ధిపొందవచ్చు. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన గుర్తింపు కార్డులు కూడా పంపిణీ చేశారు. హైకోర్టు న్యాయమూర్తి దండపాణి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.భాస్కర్, కార్యదర్శి ఎస్.తిరువేంగడం, ట్రెజరర్ షణ్ముగం, రౌండ్ టేబుల్ ఇండియా ఏరియా-2 ఛైర్మెన్ కుణాల్ చౌదరి, రౌండ్ టేబుల్ మద్రాస్ నైట్ 181 ఛైర్మెన్ సాయిచందన్ తంగుటూరి తదితరులు పాల్గొని న్యాయమూర్తులను ఘనంగా సత్కరించారు.



కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఇన్‌ఛార్జీ సీజే కృష్ణకుమార్, నిర్వాహకులు

12వ స్థానంలో స్మార్ట్ మీటరు పథకం

ఐసిఎఫ్, సెప్టెంబరు 26: దేశంలో స్మార్ట్ మీటర్ పథక అమలులో రాష్ట్రం 12వ స్థానంలో ఉంది. స్మార్ట్ మీటర్లను అన్ని విద్యుత్ కనెక్షన్లకు అమర్చాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర విద్యుత్ శాఖ ఆదేశాలు జారీచేసింది. ఈ మీటరులో విద్యుత్ రీడింగ్ తేదీని అప్‌లోడ్ చేసేందుకు వీలు కల్పించారు. ఆ తేది రాగానే తనంతటతానుగా విద్యుత్ బిల్లు వివరాలను ఎస్ఎంఎస్ ద్వారా వినియోగదారుల మొబైల్ ఫోన్లకు చేరవేస్తోంది. రాష్ట్రంలో 3.01 కోట్ల విద్యుత్ కనెక్షన్లలో స్మార్ట్ మీటర్లు అమర్చేందుకు విద్యుత్ బోర్డు నిర్ణయించింది. స్థానిక టి.నగర్‌లో 1.26 లక్షల కనెక్షన్లకు ఈ మీటర్లు అమర్చారు. మిగిలిన కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు అమర్చే పనులకు ఒప్పంద సంస్థను ఎంపికకు టెండర్లు విడుదల చేశారు.

ఇడ్లీ, ఎండు చేపలకు భౌగోళిక గుర్తింపు కోరుతూ దరఖాస్తు

ఐసిఎఫ్, సెప్టెంబరు 26: రాష్ట్ర పారంపర్య ఆహారమైన ఇడ్లీతో పాటు ఐదు రకాల వస్తువులకు భౌగోళిక గుర్తింపు పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వ టీఎన్ అపెక్స్ సంస్థ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా వద్ద దరఖాస్తు చేసుకుంది. ఆహారానికి సంబంధించిన వృత్తుల సంస్థలకు అవసరమయ్యే సహాయాలను టీఎన్ అపెక్స్ సంస్థ అందజేస్తోంది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వృత్తుల శాఖ ఆధ్వర్యంలో పనిచేసే ఈ సంస్థ ఇడ్లీ, రామనాథపురం పట్టరై కరువాడు, చెట్టినాడు కై మురుక్కు, సీడై, కోవిల్‌పట్టి సీవల్, రామనాథపురం తాటిబెల్లం అనే ఐదు వస్తువులకు భౌగోళిక గుర్తింపు పొందేందుకు దరఖాస్తు చేసుకుంది.

వైభవంగా గురువైద్యుడి వార్షిక గురుపూజ


వేడుకల్లో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

వేలూరు, సెప్టెంబరు 26: పుట్టు మహర్షి సిద్ధ వైద్యుడు, పుట్టు మహర్షి గురుపారంపర్యంలో 47వ గురు వైద్యులు కేపీ అర్జునన్ 5వ వార్షిక గురు పూజ గురువారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అఖిల భారత అప్పాజి పరివార్ వేలూరు అప్పాజి స్వామి పాల్గొని గురు పూజ వేడుకలు ప్రారంభించారు. కార్యక్రమంలో బెంగళూరు డీడీయూ యూనివర్సిటీ లెక్చరర్ హరిరామమూర్తి, 48వ గురువైద్యుడు తంబాచ్చారి, తమిళనాడు పారంపర్య సిద్ధ వైద్య మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా.సెల్వం, వైద్యులు జయరామన్, సంపత్, వసంత మిల్లన్ రాజ్, పళని, రాజ, పూంగావనం, పుట్టు మహర్షి సిద్ధ వైద్య గురుకులం విద్యార్థులు పాల్గొన్నారు.

గాంధీ నగర్‌లో స్వచ్ఛభారత్



స్వచ్ఛభారత్‌లో ఆక్సీలియం కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు

వేలూరు, సెప్టెంబరు 26: స్థానిక గాంధీ నగర్‌లో కాట్పాడి ఆక్సీలియం కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్నారు. కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులతో కలసి చేపట్టిన ఈ కార్యక్రమాన్ని మండల కమిటీ అధ్యక్షులు పుష్పలత వన్నియరాజ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వందమందికి పైగా ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

పేర్నాంబట్టు డివిజన్‌లో కలెక్టర్ పర్యటన


కాలువ పూడికతీత పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, సెప్టెంబరు 26: పేర్నాంబట్టు డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పేర్నాంబట్టు మున్సిపాలిటీలోని ఆదిద్రావిడ సంక్షేమ పాఠశాలకు వెళ్లిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం 20వ వార్డు పరిధిలోని చిన్న బజార్‌లో కాలువ పూడికతీత పనులను పరిశీలించారు. కలెక్టర్ వెంట గుడియాత్తం తహసీల్దార్ శుభలక్ష్మి, పేర్నాంబట్టు మున్సిపాలిటీ అధ్యక్షులు ప్రేమ, ఉపాధ్యక్షులు ఆలియార్ జాఫర్ అహ్మద్, పేర్నాంబట్టు బీడీఓ వినాయకమూర్తి, మున్సిపాలిటీ కమిషనర్ వేలవన్ తదితరులున్నారు.

కొడైకెనాల్‌లో కొండ పగుళ్ళు

పరిశీలించిన కేంద్ర బృందం

అడయార్, సెప్టెంబరు 26: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన దిండిగల్ జిల్లా కొడైకెనాల్ కొండ ప్రాంతంలోని క్లావరై అనే ప్రాంతంలో వందరవు అటవీ ప్రాంతంలో భారీ పగుళ్ళు ఏర్పడ్డాయి. దీంతో కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రాంతంలో సంభవించినట్టుగా కొండచరియలు విరిగిపడొచ్చని అటవీశాఖ అధికారులు భయపడ్డారు. ఈ విషయాని భూగోళ శాస్త్రవేత్తలకు తెలియజేయగా, చెన్నై కేంద్రానికి చెందిన కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం ఈ పగుళ్ళను గురువారం పరిశీలించింది. ఈ పగుళ్ళకు కారణాలను ఒకటి రెండు రోజుల్లో వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

కొత్త తహసీల్దార్‌కు రెడ్‌క్రాస్ శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న రెడ్‌క్రాస్ సభ్యులు

వేలూరు, సెప్టెంబరు 26: వేలూరు రెవెన్యూ డివిజన్ కొత్త తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన బాలసుబ్రమణ్యన్‌కు కాట్పాడి రెడ్‌క్రాస్ తరఫున శుభాకాంక్షలు తెలిపారు. రెడ్‌క్రాస్ అవై అధ్యక్షుడు జనార్ధనన్ నేతృత్వంలో సభ్యులు తహసీల్దార్‌కు శాలువ కప్పి శుభాకాంక్షలు తెలిపడంతో పాటు సైన్స్ పుస్తకం అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న తహసీల్దార్ బాలసుబ్రమణ్యన్ మాట్లాడుతూ... కాట్పాడి రెడ్‌క్రాస్ పలు సేవా కార్యక్రమాలు చేపడుతోందని, భవిష్యత్‌లోనూ ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాలని, అందుకు తన సహాయ సహకారాలుంటాయని తెలిపారు.

వేడుకగా ఏసీఎస్ జన్మదినం

వేలూరు, సెప్టెంబరు 26: గుడియాత్తం నగర పుదియ నీతి పార్టీ తరపున ఆ పార్టీ స్థాపకుడు ఏసీ షణ్ముగం జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిచ్చానూరు తేరడి మురుగన్ ఆలయంలో ప్రత్యేక అభిషేక, ఆరాధనలు నిర్వహించి, ప్రజలకు స్వీట్లు పంపిణీ, అన్నదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల సెక్రటరీ శరవణన్, నగర సెక్రటరీ రమేష్, సమాచార శాఖ మండల సెక్రటరీ ప్రవీణ్‌కుమార్, ఏసీఎస్ నగర పేరవై సెక్రటరీ శశికుమార్ సహా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కులగణన చేపట్టాలంటూ ఆందోళన


ఆందోళనలో కార్యకర్తలు

వేలూరు, సెప్టెంబరు 26: జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ హక్కుల కూటమి తరపున గురువారం ఆందోళన చేపట్టారు. కలెక్టర్ కార్యాలయ సమీపంలో చేపట్టిన ఆందోళనలకు కూటమి జిల్లా అధ్యక్షుడు మురళీధరన్, జిల్లా సెక్రటరీ శ్రీనాథ్, జిల్లా కోశాధికారి పార్తీపన్, జిల్లా మహిళా శాఖ సెక్రటరీ భారతి, దక్షిణ మండల అధ్యక్షుడు రాజమాణిక్యం తదితరులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా పోలీసు శాఖ పరీక్షల కమిటీ సభ్యుడు, స్థాపక అధ్యక్షుడు రత్నసభాపతి పాల్గొని, కులగణన చేపట్టాలంటూ డిమాండ్ చేశారు. జిల్లా యువజన విభాగం సెక్రటరీ జగజ్జీవనరామ్ వందన సమర్పణతో ఆందోళన ముగిసింది.

మాజీ ప్రధానికి సీఎం జన్మదిన శుభాకాంక్షలు

పెరంబూర్, సెప్టెంబరు 26: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ముఖ్యమంత్రి స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పంజాబ్ రాష్ట్రంలో ఉన్న కా అనే గ్రామంలో 1932 సెప్టెంబరు 26 జన్మించిన మన్మోహన్ సింగ్ 2004 నుంచి 2014 వరకు రెండు సార్లు దేశ ప్రధానిగా బాధ్యతలు వహించారు. ఆయన 92వ జన్మదినం సందర్భంగా సీఎం స్టాలిన్ తన ఎక్స్‌లో... మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు జన్మదిన శుభాకాంక్షలు. ఆయన దూరదృష్టితో కూడిన నాయకత్వంలో అభివృద్ధి చెందిన దేశ ఆర్థికాభివృద్ధిని ఎవరూ మరువలేరు. ఆయన దేశానికి అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఆయన జ్ఞానం, అంకితభావం రాబోయే తరాలకు స్ఫూర్తికావాలి అంటూ సీఎం తన జన్మదిన శుభాకాంక్షల్లో తెలిపారు.

28న పీడియాట్రిక్ ఎడ్యుకేషన్‌పై సదస్సు

● ఎస్ఆర్ఎంసీ-ఆర్ఐ ఏర్పాటు

అడయార్, సెప్టెంబరు 26: స్థానిక పోరూర్‌లోని శ్రీ రామచంద్ర మెడికల్ కాలేజీ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఐఏపీ మెడికల్ ఎడ్యుకేషన్ చాప్టర్, ఐఏపీ - టీఎన్ఎస్‌సీ, ఐఏపీ - నీసీబీ సంయుక్తంగా ఈ నెల 28, శనివారం పీడియాట్రిక్ ఎడ్యుకేషన్‌పై 11వ జాతీయ సదస్సు నిర్వహించనున్నాయి. శనివారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు ఎస్ఆర్ఐహెచ్ఈఆర్ ప్రాంగణంలోని యూనివర్సిటీ ఆడిటోరియంలో ఈ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుంది. ఈ సదస్సులో వివిధ విభాగాల నిపుణులు ప్రసంగిస్తారు. ముఖ్య అతిథిగా టీఎన్ డాక్టర్ ఎంజీఆర్ మెడికల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.నారాయణస్వామి పాల్గొంటారని ఎస్ఆర్ఐహెచ్ఈఆర్ మీడియా విభాగం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది.

కేరళ పర్యాటకులకు థర్మల్ స్కాన్ పరీక్షలు


కన్నియాకుమారి వద్ద కేరళ నుండి కారులో వచ్చిన వారికి థర్మల్ స్కాన్ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

చెన్నై, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేరళలో నీపా వైరస్ సోకి ఒకరు మృతి చెందటం, ఆ వైరస్ వేగంగా వ్యాపిస్తుండటంతో కన్నియాకుమారిలో రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులు ఆ రాష్ట్రం నుండి వచ్చే పర్యాటకులకు థర్మల్‌స్కాన్ చేస్తున్నారు. సుప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన కన్నియాకుమారికి కేరళ నుంచి రోజూ వేల సంఖ్యలో పర్యాటకులు విచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం కేరళ నుండి వచ్చే వాహనాలను ఆరోగ్యశాఖ అధికారులు నిలిపి, అందులో ప్రయాణిస్తున్నవారికి థర్మల్ స్కాన్ చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్యారీస్, సెప్టెంబరు 26: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దిగువ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అడయార్: బీసెంట్ నగర్ 1 నుంచి 7వ అవెన్యూ, 1 నుంచి 31 క్రాస్ వీధులు, కస్టమ్స్ కాలనీ, బీచ్ హోమ్ అవెన్యూ, సీపీడబ్ల్యూడీ క్వార్టర్స్, రిజర్వ్ బ్యాంక్ క్వార్టర్స్, దామోదరపురం, ఊరూరు కుప్పం, తిరువళ్లువర్ నగర్, ఓడైమా నగర్, కళాక్షేత్ర కాలనీ, ఎల్లయమ్మన్ ఆలయ వీధి, అన్నా కాలని, కక్కన్ కాలనీ, లక్ష్మీపురం, ఎంజీఆర్ రోడ్డు, శివగామిపురం, మాళవ్య అవెన్యూ, రాధాకృష్ణన్ నగర్, మరుందీశ్వర నగర్, శ్రీరామ్ నగర్, అన్నా వీధి, ముత్తులక్ష్మి వీధి, వాల్మీకి నగర్, ఆర్బీఐ కాలని, తూర్పు మాడ వీధి, కళాక్షేత్ర రోడ్డు, వాల్మీకి రోడ్డు, వేంబులిఅమ్మన్ ఆలయ వీధి, కుప్పం బీచ్, సీజీఈ కాలని, రాజీవ్ గాంధీ టీచర్స్ కాలని, జయరాం వీధి, ఎల్బీ రోడ్డు, సుబ్రమణ్యం కాలని, ఎస్బీఐ కాలని, కర్పగం గార్డెన్, శాస్త్రి నగర్, పద్మనాభ నగర్ 4,5 వీధులు, పరమేశ్వరి నగర్, జీవరత్నం నగర్, శాంతి కాలని, వెంకటేశ్వర నగర్, అరుణాచలపురం, రామస్వామి గార్డెన్, బీసెంట్ అవెన్యూ, అడయార్ బ్రిడ్జి రోడ్డు, ఆర్ఎస్ కాంపౌండ్.

రాయపేట: ఎక్స్‌ప్రెస్ అవెన్యూ, కుక్స్ రోడ్డు, వైట్స్ రోడ్డు, పటుల్లాస్ రోడ్డు, చెల్లపిళ్లై రోడ్డు, ఆర్‌టీబీ రోడ్డు, స్మిత్ లేన్, జనరల్ పీటర్స్ రోడ్డు, టీవీ పేట, ఉస్మాన్ మురుక్ రోడ్డు, సుబేదార్ హుస్సేన్ రోడ్డు, స్వామి ఆచారి వీధి, నైనియప్ప వీధి, ఆయిల్ మొంగర్ వీధి, పక్రీ సాహెబ్ వీధి, వీఎం దాస్ రోడ్డు, సుబ్బరాయ రోడ్డు

అయ్యప్పన్‌తాంగల్: అయ్యప్పన్‌తాంగల్, ఆర్ ఆర్ నగర్, కాట్టుపాక్కం, పుష్పా నగర్, వేణుగోపాల్ నగర్, అన్నై ఇందిరా నగర్, వలసరవాక్కం, పోరూర్ గార్డెన్ ఫేస్-1,2, రామస్వామి నగర్, అర్బన్ ట్రీ, ఆర్కాడు రోడ్డు కొంత భాగం, ఎంఎం ఎస్టేట్, జీకే ఎస్టేట్, చిన్న పోరూర్, వానాగరంలోని కొంత భాగం, భరణి పుత్తూర్, కారంబాక్కం, సమయపురం, పొన్ని నగర్, చెట్టియార్ నగర్, పూందమల్లి హైవేలోని కొంత భాగం, పెరియ కొళత్తువాంజేరి, మధురం నగర్, తెల్లిఅగరం

నంగనల్లూర్: బీవీ నగర్, ఎంజీఆర్ రోడ్డు, కనక మ్మాళ్ స్కూల్, విశ్వనాధపురం, హిందూ కాలని, ఎన్జీఓ కాలని, కేకే నగర్, టీచర్స్ కాలని, ఎస్బీఐ కాలని మెయిన్ రోడ్డు, ఎక్స్‌టెన్షన్, ఏజీఎస్ కాలని, దురైస్వామి గార్డన్, 100 అడుగుల రోడ్డులో కొంత భాగం, సివిల్ ఏవియేషన్ కాలని, అయ్యప్పా నగర్, కన్నిక కాలని, లక్ష్మీ నగర్ కొంత భాగం, ఎస్బీఐ కాలని 3వ వీధి, టీఎన్‌జీవో కాలని, లక్ష్మీనగర్, జయంతి నగర్, ఉల్లగరం, ఆళ్వార్ నగర్ 46వ వీధి, మెక్‌మిలన్ కాలని, పెరుమాళ్ నగర్, నెహ్రూ కాలని 1 నుంచి 45 వీధులు, కులక్కర వీధి, కపిలర్ వీధి, కాలేజి రోడ్డు, వేంబులిఅమ్మన్ వీధి, హిందూ కాలని, విశ్వనాధపురం, జోసఫ్ వీధి, ముత్తుస్వామి వీధి, గోవిందస్వామి వీధి, ఎల్లముత్తమ్మన్ ఆలయ వీధి, చర్చి రోడ్డు, కృష్ణస్వామి రోడ్డు, మూవరసం పేట, పల్లవన్‌తాంగల్ కొంత భాగం

పమ్మల్: వెంకటేశ్వర నగర్, త్రిమూర్తుల నగర్, అగస్తీశ్వర ఆలయం 1,2 వీధులు, ఆండాళ్ నగర్ కౌల్ బజార్, ఇందిరా నగర్, శివశంకర్ నగర్, ఈసీ టీవీ నగర్, మల్లియమ్మ నగర్, ప్రేమ్ నగర్, కల్లియమ్మన్ నగర్, కెరుగంబాక్కం

అంబత్తూర్: అంబత్తూర్ టీఏ సైకిల్స్ రోడ్డులోని ఎంటీహెచ్ రోడ్డు, కేఎస్సార్ నగర్, వీజీఎన్ నగర్, కామరాజపురం, రామాపురం, పట్టరవాక్కం, టీచర్స్ కాలని, వానగరం రోడ్డు, అన్నై సత్యా నగర్, ఎంకేబీ నగర్, శివానంద నగర్, తిరువేంకట నగర్, సోలపురం రోడ్డు, ఇందిర నగర్, గణపతి రోడ్డు కృష్ణాపురం, అంబత్తూర్ ఓల్డ్ టౌన్, విజయలక్ష్మి పురం, వెంకటాపురం, భాను నగర్, పృథ్వీపాక్కం

గుమ్మిడిపూండి: పాపంకుప్పం, సిప్కాట్ పారిశ్రామికవాడ ప్రాంగణం

ఇరుంబులియూర్: సుధానంద భారతి వీధి, మోతీలాల్ నగర్, లక్ష్మీనగర్, గణపతిపురం, శర్మా రోడ్డు, మురుగేశన్ రోడ్డు, భరణినెల్లయప్పర్ వీధి.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ చర్యలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 26: నకిలీ పత్రాలతో జలవనరులు, ఇతర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు, స్థలాలు ఆక్రమించే వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలని జిల్లా కలెక్టర్లకు రాష్ట్రప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలో ప్రభుత్వ స్థలాలను కొందరు ఆక్రమించి గృహాలు, వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నారు. ఈ ఆక్రమణలు తొలగించేందుకు వివిధ చట్టాలున్నప్పటికీ, ఆక్రమణదారులకు మొదట నోటీసులిచ్చిన తరువాత చర్యలు చేపడుతున్నారు. కొన్ని చోట్ల ఆక్రమణదారులు అధికారులకు ఎదురు తిరుగుతున్నారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలని జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేశారు.

30న పోలీసు వాహనాల వేలం

పెరంబూర్, సెప్టెంబరు 26: గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ వినియోగించిన ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల వేలం ఈ నెల 30వ తేది జరుగనుంది. ఎగ్మోర్‌లోని రాజరత్నం స్టేడియంలో ఉదయం 10 గంటలకు 109 నాలుగు చక్రాలు, 192 ద్విచక్రవాహనాలు మొత్తం 301 వాహనాలు వేలం వేయనున్నారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు తమ గుర్తింపు కార్డు, జీఎస్టీ సర్టిఫికెట్‌తో పాటు రూ.1,000 డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనవచ్చు. బహిరంగ వేలంలో వాహనాలు కొనుగోలు చేసిన వేలంలో పాడిన నగదుకు 25 శాతం ఆ రోజే చెల్లించాలి. మిగిలిన 75 శాతం, జీఎస్టీ రుసుముతో కలిపి చెల్లించిన తర్వాత వాహనం తీసుకెళ్లేందుకు అనుమతించనున్నట్లు నగర పోలీసు శాఖ ప్రకటనలో తెలిపింది.

ఆర్ఎస్ఎస్ కవాతుకు అనుమతి నిరాకరణ

పెరంబూర్, సెప్టెంబరు 26: విజయదశమి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 58 ప్రాంతాల్లో అక్టోబరు 6న ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కవాతు ప్రదర్శనకు పోలీసు శాఖ అనుమతి నిరాకరించింది. కవాతుకు అనుమతించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ పరిశీలించిన హైకోర్టు, వినతిపత్రాలు పరిశీలించి నివేదిక ఇవ్వాలని పోలీసు శాఖకు ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో, నిబంధనలకు వ్యతిరేకంగా ఉండడంతో ఈ ప్రదర్శనకు అనుమతులివ్వలేమని పోలీసు శాఖ తెలియజేసింది.

తొమ్మిదో తరగతి విద్యార్థిని కిడ్నాప్.. వివాహం

● యువకుడి అరెస్టు

అడయార్, సెప్టెంబరు 26: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన తొమ్మిదో తరగతి విద్యార్థిని కిడ్నాప్ చేసి, బలవంతంగా వివాహం చేసుకున్న కేసులో యువకుడిని సేలం జిల్లా పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. సేలం జిల్లా ఇరుంపాలైకు చెందిన బాలిక ఓ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుంది. ఈ బాలికకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సేలం జిల్లాకు చెందిన ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఆ బాలిక పాఠశాలకు వెళ్ళి ఇంటికి తిరిగిరాలేదు. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇందులో ఆ బాలిక ఆత్తూరుకు సమీపంలోని వేప్పనత్తం అనే ప్రాంతానికి చెందిన యువరాజ్ (19) అనే యువకుడు కిడ్నాప్ చేసి, పెళ్ళి చేసుకున్నట్టు గుర్తించారు. ఆ తర్వాత వారు ఉన్న ప్రాంతానికి వెళ్ళి యువతిని రక్షించి, యువరాజ్‌ను పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో కారు నడిపిన వ్యక్తికి దేహశుద్ధి

ప్యారీస్, సెప్టెంబరు 26: స్థానిక అన్నాసాలైలో మద్యం సేవించి వేగంగా కారు నడిపిన వ్యక్తికి డ్రైవర్లు దేహశుద్ధి చేశారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు అన్నాసాలైలో వేగంగా వెళ్లిన కారు రోడ్డు పక్కన నిలిపిన ఆటో, కారు, బైక్‌ను ఢీకొనడంతో ఆగ్రహం చెందిన ఆ వాహనాల డ్రైవర్లు ఆ కారును వెంటాడి థౌజండ్ లైట్స్ మెట్రో రైల్వేస్టేషన్ వద్ద అడ్డుకున్నారు. ఆ కారులో ఉన్న సుమారు 35 ఏళ్ల వ్యక్తిని చితకబాది పోలీసులకు అప్పగించారు.

మూడు పంచలోహ విగ్రహాల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న విగ్రహాలు

పెరంబూర్, సెప్టెంబరు 26: నగరంలో వాహనతనిఖీలు చేపట్టిన పోలీసులు మూడు పంచలోహ విగ్రహాలు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక టీపీ సత్రం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మదీనా మసీదు సమీపంలో మంగళవారం రాత్రి పోలీసులు వాహనతనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ద్విచక్రవాహనంపై వచ్చి వ్యక్తులు, పోలీసులను చూసి తప్పించుకునేందుకు యత్నించగా, పోలీసులు వారిని వెంటాడి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి బ్యాగులు తనిఖీ చేయగా అందులో 1.5 అడుగుల ఎత్తున్న మురుగన్ విగ్రహం, అడుగు ఎత్తున్న వల్లి, దేవసేన విగ్రహాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో టీపీ సత్రంకు చెందిన ఆకాష్ ఎబినేజర్, కేకే నగర్‌కు చెందిన రాజేష్‌ఔ), ఆవడికి చెందిన రషీద్ అహ్మద్ లను అరెస్ట్ చేశారు. ఈ విగ్రహాలు 150 ఏళ్ల ప్రాచనమైనవని, ఈ విగ్రహాలను ఏదైనా ఆలయం నుంచి చోరీ చేశారా, లేక మరేదైనా కారణం ఉందా అనే కోణాల్లో విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎన్‌కౌంటర్‌కు భయపడి రౌడీ 'బిగిల్ మణి' లొంగుబాటు

చెన్నై, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తాంబరంలో పేరుమోసిన రౌడీ 'బిగిల్‌మణి' ఎన్‌కౌంటర్‌కు భయపడి గురువారం తాంబరం కోర్టులో లొంగిపోయాడు. ఇతడిపై ఐదు హత్యకేసులున్నాయి. ఈ నేపథ్యంలో గాలింపు చర్యల్లో భాగంగా తనను ఎన్‌కౌంటర్ చేయడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారనే పుకార్లకు భయపడి బిగిల్ మణి లొంగిపోయినట్లు పోలీసు అధికారులు తెలిపారు. మేజిస్ట్రేట్ ఉత్తర్వు ప్రకారం అతడిని పోలీసులు జైలుకు తరలించారు.

రామేశ్వరం జాలర్లపై శ్రీలంక నావికాదళం కాల్పులు

చెన్నై, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికాదళం ఆరు గస్తీ నౌకలతో రామేశ్వరానికి చెందిన 20 మంది జాలర్లను చుట్టుముట్టి, వారి వైపు కాల్పులు జరిపి తరిమికొట్టింది. బుధవారం రామేశ్వరం నుంచి మరపడవల్లో వెళ్ళిన జాలర్లు గురువారం వేకువజాము చేపలు పడుతుండగా గస్తీ నౌకలో వచ్చిన శ్రీలంక నావికాదళం తుపాకులతో కాల్పులు జరిపారు. దీంతో భీతిల్లిన జాలర్లు వలలను తెంచుకుని వేగంగా పడవలు నడుపుకుంటూ తీరానికి చేరుకున్నారు. ఈ సంఘటనపై జాలర్లు రామేశ్వరం సముద్రదతీర భద్రతా విభాగం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మా జాలర్లను విడిపించండి

● మైలాడుదురై ఎంపీ వినతి

అడయార్, సెప్టెంబరు 26: శ్రీలంక నావికాదళం అక్రమంగా అరెస్టు చేసిన తమ రాష్ట్రానికి చెందిన జాలర్లను తక్షణం విడిపించాలని శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకేకు మైలాడుదురై ఎంపీ సుధ లేఖ రాశారు. మైలాడుదురై నియోజకవర్గ పరిధిలోని పూంపుహార్, చంద్రపాడి, వానగిరి, చిన్నమేడు, మడత్తుకుప్పం తదితర కుప్పాలకు చెందిన 37 మంది జాలర్లు సముద్రంలో చేపలు పడుతుండగా, లంక నావికాదళం అరెస్టు చేసింది. ఈ జాలర్లను విడుదల చేయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో మైలాడుదురై ఎంపీ సుధ కూడా జాలర్ల విడుదల కోసం లంక అధ్యక్షుడికి లేఖ రాశారు. ఈ నెల 21వ తేదీన సముద్రంలో గల్లంతై చనిపోయిన ఇద్దరు లంక జాలర్ల మృతదేహాల ఆచూకీ కోసం మైలాడుదురై జాలర్లు సముద్రంలో గాలించారని గుర్తు చేశారు. మానవతా దృక్పథంలో సాయం చేయడం తప్పా. అందుకే 37 మంది జాలర్లను అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు.


వేలూరు మండలస్థాయి ముఖ్యమంత్రి ట్రోఫీ పోటీల్లో భాగంగా సిలంబు క్రీడలో విజేతలుగా నిలిచిన రామ్‌చరణ్, దర్శన్‌లను అభినందిస్తున్న తిరువణ్ణామలై జిల్లా కలెక్టర్ భాస్కరన్


సక్సెస్ మీట్‌లో చిత్రబృందం

'లబ్బర్ బంతు'కు అదనపు థియేటర్లు

చిత్రజ్యోతి

తమిళరసన్ పచ్చముత్తు దర్శకత్వంలో ప్రిన్స్ పిక్చర్ పతాకంపై ఎస్.లక్ష్మణ్ కుమార్ నిర్మించగా హరీష్ కళ్యాణ్, సంజన హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'లబ్బర్ బంతు'. అట్టకత్తి దినేష్, శ్వాసిక, కాళి వెంకట్, బాల శరవణన్, గీతా కైలాసం, దేవదర్శిని ఇతర పాత్రలు పోషించారు. ఈ నెల 20వ తేదీ శుక్రవారం విడుదలైన ఈ చిత్రం సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రేక్షకుల నుంచి మంచి స్పందనతో పాటు వసూళ్ళు అధికంగా ఉండటంతో సినిమాకు అదనపు థియేటర్లను కేటాయించారు. గ్రామీణ క్రికెట్ క్రీడా నేపథ్యంలో 'ఈగో' అనే చిన్న పాయింట్‌తో ఈ చిత్రాన్ని దర్శకుడు తెరకెక్కించిన తీరు అనేక మంది దర్శకులు ప్రశంసిస్తున్నారు. 'తంగలాన్' ఫేం పా.రంజిత్ వంటివారు ఏకంగా చిత్రబృందాన్ని ప్రత్యేకంగా ఆహ్వానించి అభినందించారు. అలాగే, ఈ సినిమా చూసిన ప్రేక్షకులు సైతం సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను పాజిటివ్ కోణంలో తెలియజేస్తున్నారు. మౌత్ పబ్లిసిటీ పెరగడంతో ఈ సినిమా హౌస్‌ఫుల్ కలెక్షన్లతో ప్రదర్శిస్తున్నారు. దీంతో ఈ మూవీకి అదనపు థియేటర్లను కేటాయించారు. విజయ్ 'ది గోట్' ప్రదర్శించిన థియేటర్లన్నీ ఇపుడు 'లబ్బర్ బంతు' చిత్రానికి కేటాయించారు. మరోవైపు ఈ చిత్రం విజయాన్ని పురస్కరించుకుని, బుధవారం ఈ చిత్ర బృందం సక్సెస్ మీట్‌ను నిర్వహించగా, ఇందులో యూనిట్ సభ్యులంతా పాల్గొన్నారు.

6 నుంచి బిగ్‌బాస్-8 సీజన్ ప్రారంభం



కొత్త హోస్ట్ విజయ్ సేతుపతి

విజయ్ సేతుపతి హోస్ట్‌గా వ్యవహరించే బిగ్ బాస్-8వ సీజన్ తమిళ రియాలిటీ షో వచ్చే నెల ఆరో తేదీ నుంచి ప్రారంభమవుతుందని ప్రకటించారు. ఈ సీజన్‌కు హోస్ట్‌గా విశ్వనటుడు కమల్ హాసన్ స్థానంలో మరో నటుడు విజయ్ సేతుపతి వ్యవహరించనున్నారు. 2016 నుంచి ప్రసారమవుతున్న ఈ రియాలిటీ షోకు బుల్లితెర ప్రేక్షకుల్లో విశేష ఆదరణ లభించింది. పైగా గత ఏడేళ్ళుగా ప్రముఖ నటుడు కమల్ హాసన్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఎనిమిదో సీజన్‌కు తన బిజీ షెడ్యూల్ కారణంగా హోస్ట్‌గా చేయలేనని ప్రకటించి తప్పుకున్నారు. ఆయన స్థానంలో విజయ్ సేతుపతిని ఎంపిక చేశారు. ఈ క్రమంలో ఈ ఎనిమిదో సీజన్‌ను అక్టోబరు 6వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభించనున్నట్టు నిర్వాహకులు ఒక టీజర్ రిలీజ్ చేశారు. 'అలుం పుదుసు.. ఆట్టముమ్ పుదుసు' అనే ట్యాగ్‌లైన్‌తో దీనికి జతచేశారు. అయితే, ఈ ఎనిమిదో సీజన్‌లో పాల్గొనే కంటెస్టెంట్స్ ఎవరన్నదానిపై ఉత్కంఠత నెలకొంది.




సింగిల్‌గా ఉండనివ్వరా?

● ఐశ్వర్య లక్ష్మి

ఇప్పటివరకు తాను ఎంతో సంతోషంగా, సింగిల్‌గా ఉంటున్నానని హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మి వెల్లడించారు. అయితే, తాను సింగిల్‌గా, సంతోషంగా ఉండటం చాలా మందికి ఇష్టంలేనట్టుగా ఉందన్నారు. మలయాళంలో 'మాయనది' అనే చిత్రం ద్వారా వెండితెరకు పరిచయమైన ఐశ్వర్య లక్ష్మి... ఆ తర్వాత కోలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. 'గట్టా కుస్తీ', 'పొన్నియిన్ సెల్వన్' ఘన విజయంతో తమిళం, తెలుగు మలయాళ ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. ఇపుడు తమిళం, మలయాళం చిత్రసీమల్లో వరుస అవకాశాలు దక్కించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆమె తాజాగా తన అభిమానులతో సోషల్ మీడియా వేదికగా చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాన్స్ అడిగిన అనేక ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు. అయితే, ఒక వీరాభిమాని మాత్రం మీరు ఎపుడు డబుల్ అవుతారు (వివాహం చేసుకుంటారు) అంటూ ప్రశ్నించారు. దీనికి ఆమె సమాధానమిస్తూ, 'ప్రస్తుతం నేను సింగిల్‌గా చాలా హ్యాపీగా ఉన్నాను. కానీ, చాలా మంది పెళ్ళి ఎపుడు చేసుకుంటారంటూ పదేపదే ప్రశ్నిస్తున్నారు. నేను సింగిల్‌గా సంతోషంగా ఉండటం ఇష్టం లేదా?. దయచేసి నన్ను డబుల్ చేసేందుకు ప్రయత్నించవద్దు' అని ఆమె విజ్ఞప్తి చేశారు.

బుల్లితెర యాంకర్‌గా హీరో విజయ్ ఆంటోని



డైరెక్టర్, సంగీత దర్శకుడు, నిర్మాత, హీరో విజయ్ ఆంటోనీ బుల్లితెర యాంకర్‌గా కనిపించనున్నారు. తన కెరీర్ ఆరంభంలో సంగీత దర్శకుడైన విజయ్ ఆంటోనీ... హీరోగా నటించిన తొలి చిత్రమే 'నాన్' ఘన విజయం సాధించింది. ఆ తర్వాత 'సలీం', 'పిచ్చైకారన్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్స్ తన ఖాతాలో వేసుకున్నారు. కొన్ని చిత్రాలు బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచినప్పటికీ ఇండస్ట్రీలో ఆయన మార్కెట్ విలువ మాత్రం ఏమాత్రం తగ్గలేదు. ఇటీవల విడుదలైన 'రోమియో', 'మళై పిడిక్కాద మణిదన్' చిత్రాలు కూడా పరాజయంపాలయ్యాయి. ఈ శుక్రవారం 'ఆయన నటించిన 'హిట్లర్' సినిమా విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో జీ తమిళ్ టీవీలో కొత్తగా ప్రారంభమయ్యే 'మహానడిగై' అనే కార్యక్రమానికి ఆయన యాంకర్‌గా వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 5వ తేదీ నుంచి ప్రారంభంకానుంది. దీనికి సంబంధించిన ప్రోమో కూడా విడుదల చేశారు. ఈ కార్యక్రమం ద్వారా హోస్ట్‌గా ఎలాంటి విషయాలు మాట్లాడుతారన్న సర్వత్రా ఆసక్తి నెలకొంది.

● వరల్డ్ టూరిజం డే...


కొత్త ప్రదేశాలు పర్యటిద్దాం...

సరికొత్త అందాలు అన్వేషిద్దాం

● నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

రంగుల జీవితానికి వన్నెచిన్నెలు కూరుస్తాయి పర్యటనలు. ఆధునిక జీవనశైలిలోని ఒత్తిడుల నుండి ఉపశమనం కోరుతూ కొందరు, కొత్త ప్రదేశాలను సందర్శించాలని అభిలషిస్తే.. మరికొందరు, పుణ్యం, పురుషార్ధం అంటూ తీర్ధయాత్రలు చేస్తుంటారు- ఇలా నేటి కాలంలో అందరూ పర్యటనలకు పెద్ద పీట వేస్తున్నారు. అందుకే పర్యాటకం ప్రతి ఒక్కరి జీవతంలోను ఒక ముఖ్యభాగమైంది. ఐక్యరాజ్య సమితి కూడా దీని ప్రాధాన్యత గుర్తించింది. 'ప్రపంచ పర్యాటక దినోత్సవం' సందర్భంగా పర్యాటక విశేషాలతో 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం....

- వేళచ్చేరి


పచ్చని హారంలా ఊటీ

ప్రపంచ పర్యాటక దినోత్సవం...ఎప్పుడు...?

1980వ సంవత్సరం నుండి, సెప్టెంబరు 27వ తేదీ ప్రపంచ పర్యాటక దినోత్సవం జరుపుకోవాలని, ఐక్యరాజ్యసమితి, ప్రపంచ పర్యాటక సంస్థ నిర్ణయించడం జరిగింది. అప్పటి నుంచి అదే తేదీన ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలు కొన్ని అధికారికంగా, మరికొన్ని అనధికారికంగాను ఉత్సాహంగా దీనిని జరుపుకుంటున్నాయి. ఈ సమయంలో ప్రపంచమంతా కూడా ఆహ్లాదమయిన వాతావరణంతో పర్యటనలకు అనుకూలంగా ఉంటుంది.

పర్యాటక రంగం అంతర్జాతీయంగా సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక రంగాలకు ఎలా దోహదపడుతున్నది, దానికి అవసరమైన ఎలాంటి చర్యలు తీసుకోవాలి మొదలైన విషయాలను గురించి ఆ రోజు చర్చించుకొని ప్రణాళికలు రూపొందించుకుంటారు.

పర్యాటకం- నేపథ్యం:

ప్రాచీన కాలం నుంచి మన దేశంలో పర్యాటకం ఉనికి ఉన్నట్లు తెలుస్తోంది. 'నారదుడు త్రిలోక సంచారి' అని పురాణాలు తెలియజేస్తున్నాయి. ఆనాటి దేవతలు, రుషులు, రాజులు కూడా భూలోకానికి, ఇంద్రలోకానికి రాకపోకలు జరిపేవారని ఇతిహాసాలు చెబుతున్నాయి. వైశంపాయనాది మహామునులు లోకమంతా పర్యటించి వ్యాసవిరచిత భారతాన్ని వ్యాప్తికి తెచ్చినట్లు తెలుస్తున్నది. ఎందరో విదేశీ యాత్రికులు మన దేశంలో పర్యటించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. కవులు దేశాటన చేసి పలువురు రాజులను దర్శించి, సన్మానాలు, కనకాభిషేకాలు పొందారు. నాగరికత అభివృద్ధి చెందని రోజుల్లో ప్రయాణసౌకర్యాలు లేని కాలంలో కూడా మన పూర్వీకులు కాలినడకన పుణ్యక్షేత్రాలు దర్శించేవారని తెలుస్తున్నది. అందుకే కాశీకి వెళ్లినవాడు తిరిగి వచ్చే దాక నమ్మకం లేక 'కాశీకి వెళ్లినవాడు కాటికి వెళ్లిన వాడితో సమాన'మనే వారు.

సముద్రయానం ప్రారంభమైన తరువాత మన దేశంలోని ఎందరో వర్తకులు విదేశాలతో వాణిజ్య వ్యాపార లావాదేవీలు జరిపినట్లు ఆధారాలు లభించాయి. అందుకే పర్యాటకం మనకి కొత్త విషయం కాదు. అయితే ఆధునిక కాలంలో దాని కాన్సెప్ట్ మారింది. రొటీన్ లైఫ్ నుంచి మార్పు కోసం యువత, మానసిక ప్రశాంతత కోసం వృద్ధులు, విజ్ఞాన యాత్రల పేరిట పిల్లలు - ఇలా ఆ బాలగోపాలం పర్యాటకం వైపు దృష్టిపెడుతున్నారు. ఒకప్పుడు సెలవులిస్తే అమ్మమ్మ, తాతగార్ల వూర్లకు వెళ్లే ఆనవాయితీ ఉండేది. ఇప్పటి ట్రెండ్ వేరు. పిల్లలకు సెలవలంటే విదేశాలను చుట్టిరావడం ఫ్యాషనైంది. చేతిలో డబ్బు, సమయానుకూలతను బట్టి సందర్శించే ప్రదేశాలు ఆధారపడి ఉంటాయి. ఏది ఏమైనా ఈ మార్పు పర్యాటకరంగ అభివృద్ధికి ఇతోధికంగా సాయపడుతున్నది.


పర్యాటక ప్రదేశాలు:

ప్రపంచంలోని ఏడు వింతలే కాక మరెన్నో సందర్శించాల్సిన ప్రదేశాలున్నాయి.చరిత్ర, సంస్కృతి వారసత్వం ప్రతిబింబించే కట్టడాలు,ప్రసిద్ధమైన పుణ్యక్షేత్రాలు, ప్రకృతి అందాలకు నెలవైన స్థలాలు,జలపాతాల సోయగాలు, అభయారణ్యాలు, గలగలపారే నదులు,గుహలలో దాగున్న శిల్పాలు... ఆయా దేశాలకు ప్రత్యేకమైన వింతలు, అద్భుతాలు అన్నీ పర్యాటక ప్రదేశాలే. అంతర్జాతీయ, జాతీయ పర్యాటకులను ఆకర్షించే సందర్శన స్థలాలే.

ప్రపంచంలోని అత్యంత సుందరమైన దేశాలలో భారతదేశం కూడా స్థానం సంపాదించుకున్నది. మన దేశంలో యునెస్కో వారసత్వ సంపదలుగా ప్రకటించిన అద్భుత కట్టడాలు, స్థలాలు ఎన్నో ఉన్నాయి. దక్షిణ భారతదేశంలో తమిళనాడు దేవాలయాలకు ప్రసిద్ధిచెందింది. యాత్రికుల పాలిటి పెన్నిధి. విశాలమైన ప్రాంగణాలు, పెద్ద గోపురాలతో, శిల్పకళ ఉట్టిపడే ప్రాచీన దేశాలయాలతో తమిళనాడు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంది. తంజావూరు, కంచి, మదురై, చిదంబరం, కుంభకోణం, రామేశ్వరం మొదలైన పుణ్యక్షేత్రాలకు నెలవు ఈ రాష్ట్రం. వేలాంకన్ని, నాగూర్ దర్గా చూడదగిన క్రైస్తవ, ముస్లిం మతాలకు చెందిన పవిత్ర స్థలాలుగా ప్రసిద్ధి చెందాయి. చెట్టినాడులోని వారసత్వ కట్టడాలు, చెన్నైలోని శాంతోమ్ చర్చి, హైకోర్టు బిల్డింగ్ మొదలైనవి గత చరిత్రకు సాక్షీభూతాలు. ప్రసిద్ధికెక్కిన హిల్ స్టేషన్స్, జలపాతాలు, కొండలు, కోనలు, కోటలు, బురుజులు, బీచ్‌లు సందర్శకులను ఆహ్వానిస్తుంటాయి.

మన దేశంలోని ప్రతి రాష్ట్రం పర్యాటక ప్రాంతమే. గత చరిత్ర ఆనవాళ్లను ప్రదర్శించే ప్రదర్శనశాలలు, అధ్యయన కేంద్రాలు. వ్యక్తుల నివాసాలు ఎన్నో-ఎన్నెన్నో, పర్యాటకులకు వేటికవే ప్రత్యేక ఆకర్షణలు. పర్యాటకులను ఆకర్షించడానికి, ప్రోత్సహించడానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోంది. విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు ఇన్‌క్రెడిబుల్ ఇండియా క్యాంపెయిన్, డెస్టినేషన్ ఇండియా ఎగ్జిబిషన్స్ మొదలైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నది.


తంజావూరు ఆలయం


మైమరిపించే కొడైకెనాల్

పర్యాటక పరిశ్రమ.. : పర్యాటకం ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద పరిశ్రమల్లో ఒకటి. దీని వలన దేశానికి ఎంతో ఆదాయం లభ్యమవుతున్నది. ఈ పరిశ్రమ అనుబంధంగా ఆతిధ్యం, రవాణా ఇలా ఎన్నో రంగాలు అభివృద్ధి చెందుతున్నాయి. అందుకే అన్ని దేశాలు వారి వారి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసుకుంటున్నాయి.పర్యాటక రంగం ఎంతోమందికి ఉపాధి, ఉద్యోగాలను కల్పిస్తోంది. నూతన వాణిజ్య మార్గాల అన్వేషణకు, దేశాల మధ్య స్నేహ సంబంధాల పరిరక్షణకు, దౌత్యసంబంధాల అభివృద్ధికి, కరెన్సీ విలువ పెంపునకు పర్యాటకం కీలక పాత్ర వహిస్తుంది. పర్యాటక రంగం నుండి వచ్చే ఆదాయం మెరుగైన జీవన ప్రమాణాలకు అవకాశం కల్పించడమే కాకుండా స్థానిక ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుతున్నాయి.


నాగూర్ దర్గా

లక్ష్యాలు

- ప్రపంచవ్యాప్తంగా పర్యాటక పరిశ్రమను అభివృద్ధి పరచడం
- పర్యాటకం ద్వారా సామాజిక, దేశ ప్రగతిని మెరుగ పరచయం
- పర్యాటకాన్నిన ప్రోత్సహించి ముందుకు తీసికెళ్లడం
- ఆర్థిక స్థితిగతులను అభివృద్ధి చేయడం- ఈ లక్ష్యాలతో ప్రపంచ పర్యాటక దినోత్సవం జరుపబడుతున్నది.


వేలాంకన్ని చర్చి

పర్యటనలు-ప్రయోజనాలు

పర్యటనల వల్ల కలిగే లాభాలు అనేకం. యాంత్రిక జీవనంతో అలసిన మనసుకు, శరీరానికి సాంత్వన కలిగిస్తాయి పర్యటనలు. కుటుంబ సంబంధాలు, మైత్రీబంధాలు పర్యటనలతో బలోపేతం అవుతాయి. లోకజ్ఞానం పెంపొందుతుంది. పర్యటనలకు వెళ్లినప్పుడు అందరూ కలవడంతో అనుబంధాలు, ఆత్మీయతలు పెరుగుతాయి. ఆచార వ్యవహారాలు, ఆహారపు అలవాట్లు, సంస్కృతీ సంప్రదాయాలు తెలుసుకోవడం వలన విషయ పరిజ్ఞానం, విజ్ఞానం పెంపొందుతుంది. మరి ఇన్ని ప్రయోజనాలున్న పర్యాటకానికి పెద్దపీట వేస్తూ, సత్వరం ప్రణాళికలు వేసుకొని కొత్త అందాలు దర్శించండి.

'రసాస్వాదన నైపుణ్యం, సౌందర్యకాంక్ష, కళాత్మక వైఖరి ఉంటే ప్రతి పర్యటన ఫలవంతమే.... ప్రతి అనుభవం అవధి లేని అనుభూతే'


మదురై మీనాక్షి ఆలయం


మెలికలు తిరిగిన ఏర్కాడు ఘాట్ రోడ్డు


'కార్డియాక్ షాక్ టీమ్' ప్రారంభిస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం

వడపళని కావేరిలో గుండెపోటుకు తక్షణ వైద్యం

చెన్నై, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వడపళని కావేరి హాస్పిటల్‌లో గుండెపోటుకు గురయ్యేవారికి తక్షణ వైద్యం అందించటానికి వీలుగా దేశంలో మొదటిసారిగా 'కార్డియాక్ షాక్ టీమ్' పేరుతో ప్రత్యేక వైద్యబృందాన్ని ఏర్పాటు చేశారు. దానిని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం ప్రారంభించారు. ఈ వైద్యబృందం 24 గంటలపాటు ఆస్పత్రిలో అందుబాటులో ఉంటుందని, గుండెపోటుకు గురైన వెంటనే బాధితులకు చికిత్స అందించి వారిని ప్రాణగండం నుండి కాపాడమే ఈ బృందం ప్రధాన ఆశయమని కావేరి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్ తెలిపారు. మంత్రి సుబ్రమణ్యం మాట్లాడుతూ 2004లో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తనకు తిరుచ్చి కావేరి హాస్పిటల్‌లోని వైద్యులే ప్రాణభిక్ష పెట్టారన్నారు. వైద్యరంగంలో రాష్ట్రం ముందంజలో ఉందని, ప్రస్తుతం 30దేశాల నుంచి రోగులు అంతర్జాతీయ స్థాయి వైద్యం కోసం నగరానికే వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోరూరు శ్రీరామచ్రందా విశ్వవిద్యాలయం హృద్రోగ శస్త్రచికిత్స నిపుణుడు ప్రొఫెసర్ ఎస్.తనికాచలం, డాక్టర్ పూర్ణచంద్రన్, డాక్టర్ అయ్యప్పన్, డాక్టర్ మనోహరన్, డాక్టర్ సుందర్ సి తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో తిరుపతి గొడుగుల ఊరేగింపు




వేలూరు, సెప్టెంబరు 26: పేర్నాంబట్టు విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) తిరుపతి గొడుగుల కమిటీ తరఫున గొడుగుల సమర్పణ ఊరేగింపు జరిగింది. కార్యక్రమానికి వీహెచ్‌పీ నగర సెక్రటరీ ఇళమ్‌కుమరన్ అధ్యక్షత వహించారు. పేర్నాంబట్టు-వి.కోట జంక్షన్ రోడ్డులోని పెరుమాళ్ పుత్తుకోయిల్ శ్రీదేవి, భూదేవి తాయారు సమేత పెరుమాళ్ బంగారు పాదాలకు పూజలు నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారి వైపు బస్టాండ్‌లో ఉన్న తిరుమతి గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు అన్బు, సెక్రటరీ సత్య, పేర్నాంబట్టు నగర నిర్వాహకులు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు సెంజికోటకు యునెస్కో బృందం



చెన్నై, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం సమీపంలోని సుప్రసిద్ధ పర్యాటక ప్రాంతం సెంజికోటలో యునెస్కో బృందం శుక్రవారం పర్యటించనుంది. ఆ ప్రాంతాన్ని అంతర్జాతీయ చారిత్రక వారసత్వ చిహ్నంగా ప్రకటించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారి, రాష్ట్ర మంత్రి సెంజి మస్తాన్ తదితర అధికారులు సెంజికోటను పరిశీలించారు. అప్పటి నుండి సెంజికోట ప్రాంతంలో మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆ ప్రాంతం వద్ద రోప్‌కార్ నిర్మించేందుకు కూడా చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో సెంజికోటను ప్రాచీన చారిత్రక వారసత్వ సంపదగా ప్రకటించే విషయమై యునెస్కో బృందం శుక్రవారం ఆ ప్రాంతంలో పరిశీలన జరుపనుంది. ఈ కారణంగా శుక్రవారం సెంజికోటకు సందర్శకులను అనుమతించబోమని అధికారులు ప్రకటించారు.

ఎస్‌ఆర్‌ఎం హాస్పిటల్‌లో యాంటీ టొబాకో యూనిట్


పొగాకు అలవాటు మాన్పిడి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హాస్పిటల్ నిర్వాహకులు

చెన్నై, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాట్టాన్‌కొళత్తూరులోని ఎస్ఆర్ఎం వైద్యకళాశాల ఆస్పత్రి, పరిశోధక కేంద్రంలో పొగాకు అలవాటు నుంచి దూరం చేసే కేంద్రాన్ని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఆ ఆస్పత్రిలో ఏర్పాటైన కేంద్రం ప్రారంభోత్సవంలో ఆ ఆస్పత్రి డీన్ డాక్టర్ నితిన్ ఎం.నగర్కర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.వెంకటరామన్, సైక్రియాట్రీ విభాగాధిపతి డాక్టర్ ఆర్.అరుళ్ శరవణన్, డాక్టర్ నితిన్ పాల్గొన్నారు. ఈ కేంద్రం సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు. పొగాకు ఉత్పత్తులకు బానిసైన వారు, వాటి బారి నుండి విముక్తి కావటానికి నేషనల్ హెల్ప్ లైన్ 1800112356 నెంబర్‌కు, లేదా 044-47432557 అనే నెంబర్‌కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

డాక్టర్ బాత్రాలో ఎక్సోజెన్ థెరఫీ ట్రీట్మెంట్



మీడియా సమావేశంలో అక్షయ్ బాత్రా

అడయార్, సెప్టెంబరు 26: ప్రపంచంలోనే అతి పెద్ద హోమియో క్లినిక్‌ల్లో ఒకటిగా గుర్తింపు పొందిన డాక్టర్ బాత్రా హెల్త్‌కేర్ ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన, ఎక్సోసోమ్ ఆధారిత ఎక్సోజెన్ హెయిర్ ట్రీట్మెంట్ విధానాన్ని తొలిసారి నగరవాసులకు అందుబాటులోకి తెచ్చింది. పురుషులు, మహిళల్లో జుట్టురాలడం నివారించే ట్రీట్మెంట్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇదే విషయంపై నగరంలో జరిగిన మీడియా సమావేశంలో డాక్టర్ బాత్రా వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అక్షయ్ బాత్రా మాట్లాడుతూ, శక్తివంతమైన ఈ విధానాన్ని ఉపయోగించి వంశపారంపర్యంగా వచ్చే జుట్టు రాలుడు సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. వైద్యపరంగా ఈ సమస్యకు పరిష్కారం కనుగొన్నట్టు తెలిపారు. ఈ విధానంలో కేవలం మూడు నెలల్లోనే ఫలితాన్ని చూడొచ్చన్నారు. ఆ తర్వాత వెంట్రుకల పునరుత్పత్తి జరుగుతుందన్నారు.

హ్యూరేకా సిలబస్ పరిచయం చేసిన యూరోకిడ్స్



అడయార్, సెప్టెంబరు 26: దేశంలోనే అగ్రశ్రేణి ప్రీ స్కూల్ ఎక్స్‌పర్ట్ అయిన యూరోకిడ్స్ విజిబుల్ థింకింగ్ కరిక్యులమ్ అయిన హ్యూరేకా పాఠ్యాంశాల్లో 8వ వెర్షన్ ప్రారంభించినట్టు ప్రకటించింది. హార్వర్డ్ యూనివర్శిటీకి చెందిన ప్రాజెక్టు జీరో నుంచి ప్రేరణ పొంది, సమగ్రాభివృద్ధి కోసం జాతీయ విద్యా విధానం 2020 విజన్‌లో సమలేఖనం చేస్తూ ఈ కరిక్యులమ్ రూపొందించారు. ముఖ్యంగా హ్యూరేకా యువ అభ్యాసకుల విమర్శనాత్మక, సృజనాత్మక ఆలోచనా నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఇది ఎంతగానో దోహదపడుతుందని యూరోకిడ్స్ కరిక్యులమ్ డెవలప్‌మెంట్ హెడ్ డాక్టర్ అనిత మదన్ గురువారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.